క్లుప్తంగా

నులి పురుగుల ప్రభావంతో అనారోగ్యం

కపిలేశ్వరపురం: నులి పురుగుల ప్రభావంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతారని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి అన్నారు. మండలంలోని అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో డీవార్మింగ్ డే ప్రాధాన్యతను, నులి పురుగుల ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. ఈ నెల 10న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలను వైద్యారోగ్య కార్యకర్త వెన్నేటి వెంకటేశ్వరరావు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ అడబాల తాతారావు, వైద్యారోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి నామినేషన్‌కు తరలిన జనం

కపిలేశ్వరపురం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి డీవీ రాఘవులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండపేట నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజా సంఘాల కార్యకర్తలు తరలివెళ్లారు. అభ్యర్థి రాఘవులు గురువారం కాకినాడ నుంచి ఏలూరు వరకూ ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలోని మండపేట పట్టణం, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం సబ్ డివిజన్ ఈఈ కె.రత్నాలరావు గురువారం విలేకరులకు తెలిపారు. రాయవరం సబ్‌స్టేషన్‌లో కొత్తగా బ్రేకర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మాచవరం 11కేవీఏ ఫీడర్, బిక్కవోలు మండలం కొంకుదురు 11 కేవీఏ ఫీడర్, తొస్సిపూడి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మండపేట: పట్టణ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రత్నాలరావు తెలిపారు. లైన్ల మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. బైపాస్ రోడ్డు, ఏడిద రోడ్డు, ఆలమూరు రోడ్లలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీజేపీ టౌన్ కన్వీనర్‌గా ఫణి ప్రకాష్

మండపేట: పట్టణానికి చెందిన బీజేపీ యువ నాయకుడు నాళం ఫణి ప్రకాష్ ఆ పార్టీ టౌన్ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీవీ సాయిరామ్ నాయకత్వంలో మాజీ కన్వీనర్ మద్దుల సుబ్బారావు అధ్యక్షతన ఎన్నిక జరపగా ఫణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సాయిరామ్ మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు ఫణి ప్రకాష్ పార్టీ బలోపేతానికి కృషి చేసి పార్టీకి మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. బీజేపీ నాయకులు నరాల రాంబాబు, పాలూరి సత్యానందం, గొడవర్తి రామచంద్రరావు, కోటిపల్లి కృష్ణ, వల్లభనేని రవీంద్రబాబు, రావూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పాదకతలో సాంకేతికత పాత్ర కీలకం



లక్కీ డ్రా ద్వారా ఎంపికైన రైతుకు ట్రాక్టర్ అందజేస్తున్న రీజినల్ బిజినెస్ హెడ్ చక్రవర్తి

రాయవరం: వ్యవసాయ ఉత్పాదకతలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సౌత్ 1బీ రీజినల్ బిజినెస్ హెడ్ కేఎస్ఆర్ చక్రవర్తి పేర్కొన్నారు. రాయవరం మండలం చెల్లూరు గ్రామంలో గురువారం కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గ్రోమోర్ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఉపయోగించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఉత్పత్తులు సాధించడం సాధ్యమవుతుందన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ వ్యవసాయంలో రైతులు విజయాలను సాధించడంలో గణనీయ పాత్ర పోషిస్తుందన్నారు. గ్రోమోర్ ఎరువులు వినియోగించడం ద్వారా ఉత్తమ ఉత్పత్తులను రైతులు సాధిస్తున్నారన్నారు. సమావేశంలో జోనల్ మేనేజర్ కీర్తి కృష్ణ, ఎస్ఎస్‌పీ అండ్ ఆర్గానిక్స్ బిజినెస్ మేనేజరు శ్రీమాధవన్, శ్రీసందీప్ తదితరులు మాట్లాడారు. 160 మంది రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రోమోర్ రైతు సంబరాలు, కోరమండల్ నిర్వహించే పలు కార్యక్రమాల ద్వారా రైతులతో మమేకం అవ్వడం, స్థిరమైన పద్ధతుల ద్వారా ఉత్తమ ఉత్పత్తులు సాధించిన రైతులకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన రైతు కాటూరి శ్రీధర్‌కు ట్రాక్టర్, సీదా రమణ(అనపర్తి), పాముల సత్యనారాయణ(నల్లజర్ల)కు రెండు బుల్లెట్ మోటార్ సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అవగాహనే ముద్దు

- కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ఆధునిక చికిత్సా పద్ధతులు
- విస్తృతంగా ప్రచారం చేస్తున్న ప్రభుత్వాలు
- 2027 నాటికి నిర్మూలనే ధ్యేయంగా కృషి
- అందుబాటులో బహుళ ఔషధ చికిత్స
- 13 వరకూ ప్రత్యేక కార్యక్రమాలు



అంగరలో వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: కుష్ఠు వ్యాధిని వ్యక్తిగతంగా చూడటం సరికాదు. అది ఒక సామాజిక సమస్యగా పరిగణించాలి. వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడం, లక్షణాలున్నవారు సకాలంలో వైద్యులను సంప్రదించడం, క్రమం తప్పకుండా చికిత్స తీసుకోవడం చేయగలిగితే అధునాతన చికిత్సా పద్ధతులతో వ్యాధిని నిర్మూలించవచ్చు. 2027 నాటికి ఈ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా జనవరి 20 నుంచి ఈ నెల 2 వరకూ లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయినింగ్ (ఎల్‌సీడీసీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పర్శపేరుతో జనవరి 30న వ్యాధి గ్రస్తుల పట్ల సమాజం చూడాల్సిన తీరుపై ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ నెల 13 వరకూ అవగాహన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

వైఎస్ జగన్ ప్రభుత్వంలో విశేష కృషి

గతేడాది జూన్ 16 నుంచి జూలై 16 వరకూ కేంద్ర ప్రభుత్వంతో కలిసి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టింది. వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించే లక్ష్యంతో జిల్లాలో 1,408 సర్వే బృందాలను నియమించింది. క్షేత్ర స్థాయిలో సర్వే చేసి శరీరంపై మచ్చలను కలిగిన వారికి మెరుగైన పరీక్షలకు నివేదించారు. కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ పరిధిలో 18 బృందాలు, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీలలో 19 చొప్పున బృందాలు సర్వే చేశాయి. రామచంద్రపురం ఆసుపత్రి పరిధిలో ఎనిమిది కేసులను గుర్తించగా వారికి ప్రాథమిక చికిత్సను అందించారు.

రెండు నియోజకవర్గాల్లో తీవ్రత ఇలా..

ఐదు కన్నా తక్కువ మచ్చలున్నవారిని పాసి బ్యాచిలర్ కేసుగానూ, ఐదు కన్నా ఎక్కువ మచ్చలుండే వారిని మల్టీ బ్యాచిలర్ కేసుగానూ పరిగణిస్తారు. పీబీ కేసులకు రెండు రకాల మందులను ఆరు నెలలు, ఎంబీ కేసులకు మూడు రకాల మందులు ఏడాది పాటు వాడాల్సి ఉంటుంది. 2024లో రామచంద్రపురం లెప్రసీ ఆస్పత్రి పరిధిలో నాలుగు పీబీ, మరో నాలుగు ఎంబీ కేసులు, జిల్లాలో 37 కేసులను గుర్తించి చికిత్స చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఇప్పటికే వ్యాధి సోకి చికిత్స పొందుతున్నవారు అనేక మంది ఉన్నారు. కాజులూరు మండలం దుగ్గుదూరు పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు, గొల్లపాలెం పీహెచ్‌సీలో 22 మంది, రామచంద్రపురం అర్బన్ పరిధిలో 32, ద్రాక్షారామ పీహెచ్‌సీలో 30, వెల్లలో 24, కె.గంగవరం మండలం పామర్రు పీహెచ్‌సీలో 24, మండపేట అర్బన్ పీహెచ్‌సీలో 22, కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీలో 13, అచ్యుతాపురంలో 18, అంగరలో 18, ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీలో 15, చొప్పెళ్లలో 16 మంది వ్యాధి గ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు.

అవగాహనతో మెలగాలి

వ్యాధి నిర్మూలనకై క్షేత్ర స్థాయిలో ఆశా, వైద్య ఆరోగ్య కార్యకర్తలు కృషి చేస్తారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వీరిని సంప్రదించాలి. వారి ద్వారా నిర్మాణ పరమైన చికిత్స, ఇతర సేవలందుతాయి. ప్రతి పీహెచ్‌సీలోనూ ఎంపీహెచ్ఎస్ స్థాయిగల ఉద్యోగిని నోడల్ పర్సన్‌గా నియమించారు. వారిని డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో అడిషనల్ డీఎంహెచ్ఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ టీంను డీఎస్ఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. క్షేత్ర స్థాయిలో గుర్తించిన లక్షణాలు గల వారికి వ్యాధి సోకినదీ లేనిదీ ఈ టీం నిర్ధారిస్తుంది.

మానసిక దృఢత్వంతో మేలు

కుష్ఠు వ్యాధికి అధునిక చికిత్సా పద్ధతులున్నాయి. తొలుత వ్యాధిగ్రస్తులు మానసికంగా దృఢంగా ఉండాలి. మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చపై వెంట్రుకలు రాలిపోతాయి. దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశా, ఏఎన్ఎంలకు చెప్పాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్స అందిస్తారు. పుండ్లు గలవారికి అవసరమైతే కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేస్తారు.

> **లక్షణాలు కనిపిస్తే సంప్రదించాలి**
>
> 
>
> ప్రతి పీహెచ్‌సీలోనూ కుష్ఠు వ్యాధికి సంబంధించిన కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు నోడల్ పర్సన్లు ఉంటారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీపీఎంవో స్థాయి అధికారి పర్యవేక్షణలో కళాశాలలు, పాఠశాలలు, జనావాసాలకు వెళ్లి వ్యాధి లక్షణాలను వివరిస్తున్నాం. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని కానీ, వైద్య ఆరోగ్య కార్యకర్తను గానీ సంప్రదించాలి.
>
> వెన్నేటి వెంకటేశ్వరరావు, నోడల్ పర్సన్, అంగర పీహెచ్‌సీ.

అనుబంధ విభాగాల నియామకాలు శుభ పరిణామం

యువతకు చోటు కల్పించడంపై హర్షాతిరేకాలు

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం పట్ల మండలంలోని పార్టీ నాయకులు పిప్పర సంపతరావు, తాతపూడి రాజేష్ శర్మ, మల్లిపూడి శివకృష్ణ, మందపల్లి నరసింహమూర్తి, పెందుర్తి తేజ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కమిటీ కూర్పులో సామాజిక న్యాయానికి అధిక ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. దళిత సామాజిక వర్గీయులకు స్థానం కల్పించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

మండపేట: మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా పార్టీలో కష్టపడి పనిచేసే యువతకు, పలువురు ద్వితీయ శ్రేణి నాయకులకు పదవులు వరించాయి. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం నుంచి తాజా ప్రకటన వెలువడిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గారపాటి అశోక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం యువతకు అధిక ప్రాధాన్యమిచ్చి పదవులు కట్టబెట్టడం ఆనందదాయకమన్నారు. నియోజకవర్గ పరిధిలో వివిధ విభాగాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అంతా కలిసికట్టుగా శ్రమించి వైఎస్సార్ సీపీ విజయానికి బాటలు వేద్దామన్నారు.

యువజన విభాగం కన్వీనర్‌గా శ్రీకృష్ణ

మండపేట: వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ యువజన విభాగం కన్వీనర్‌గా పట్టణానికి చెందిన చోడే శ్రీకృష్ణ నియమితులయ్యారు. ఈమేరకు తాడేపల్లి నుంచి పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గ యువతలో మంచి పట్టున్న శ్రీకృష్ణ గతంలో విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకునిగా పార్టీకి సేవలందించారు. పార్టీ కార్యక్రమాల్లో తన అనుచరులతో కలిసి చురుగ్గా పని చేస్తుంటారు. ఆయన సేవలకు గానూ యువజన విభాగం నియోజకవర్గ కన్వీనర్‌గా పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక బాధ్యతలు అప్పగించారు. తన నియామకం పట్ల వైఎస్ జగన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులకు శ్రీకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

రీ సర్వేను వేగవంతం చేయాలి



కోలంకలో అధికారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ ఠాగూర్

కాజులూరు: రీ సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది వేగవంతంగా పూర్తి చేయాలని మండల తహసీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా రీసర్వే కార్యక్రమం జరుగుతున్న కోలంక, పెదలంక, నామవానిపాలెం గ్రామాల్లో గురువారం తహసీల్దారు పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కోలంకలో మాట్లాడుతూ గ్రామంలో 3,067 ఎకరాల సాగు భూమి ఉందని సర్వే నిమిత్తం 11 టీంలు పని చేస్తున్నాయన్నారు. రోజుకు 20 ఎకరాల మేర సర్వే పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ వేగేశ్వర్రావు, డీటీ చందన, స్థానిక వీఆర్వోలు దేగల సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, సర్వేయర్లు కూరాటి రాజు, దుర్గాప్రసాద్, ఉమ, సంధ్య, పలు గ్రామాల వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడకు వైఎస్సార్ సీపీ నాయకుల సంఘీభావం



ముద్రగడను కలిసిన మండపేట వైఎస్సార్ సీపీ నాయకులు

మండపేట: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత ముద్రగడ ఇంటిపై దాడి జరిగిన నేపథ్యంలో ఆయనకు సంఘీభావం తెలిపేందుకు మండపేట నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం కిర్లంపూడి తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, సీనియర్ నాయకుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, అధికారి శ్రీను, సాధనాల శివ తదితరులు ముద్రగడ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. దాడికి సంబంధించిన పూర్వా పరాలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, కక్ష సాధింపులు అధికమయ్యాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వే రాళ్లపై జగన్ చిత్రాల తొలగింపు



మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రం తొలగించిన సర్వే రాయి

మండపేట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూములకు రక్షణ కల్పించడానికి జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని భూములన్నింటిపై డ్రోన్ల ద్వారా సమగ్ర సర్వే నిర్వహించి, భవిష్యత్తులో రైతు తన భూమి కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా చర్యలు తీసుకున్నారు. సర్వే రాళ్లు పది కాలాల పాటు శాశ్వతంగా నిలిచేలా చెక్కుచెదరని రీతిలో గ్రానైట్‌తో తయారు చేయించి, సరిహద్దుల్లో వేయించారు. అయితే, గత ఎన్నికల్లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఆనవాళ్లు కనబడకుండా చేయాలని అడ్డమైన దారులు తొక్కుతోంది. ఈ నేపథ్యంలో సర్వే రాళ్లపై ఉన్న మాజీ సీఎం జగన్ చిత్రాల తొలగింపునకు పూనుకుంటోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరం గ్రామంలో ఈ ఘతన వెలుగు చూసింది. వీఆర్వోలు, గ్రామ నౌకర్లు గ్రామంలోని భూముల వద్దకు వెళ్లి, సర్వే రాళ్లను గుర్తించి, వాటిపై ఉన్న జగన్ చిత్రాలను ఎలక్ట్రికల్ మెషీన్ సాయంతో చెక్కేస్తున్నారు. రాయిని పూర్తిగా గ్రైడింగ్ చేసి జగన్ చిత్రం మాయం చేసేస్తున్నారు. దీనిపై గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించగా, జగన్ ఫొటో చెరిపేయాలంటూ తమకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారని బదులిచ్చారు. పంట భూముల మధ్యలో హద్దులు తెలుపుతూ ఎంతో అందంగా కనిపించే సరిహద్దు రాళ్లను క్వారీ రాళ్లుగా మార్చేస్తున్న వైనం చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

ఉత్తమ సేవా పురస్కారాల అందజేత



డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న వైద్యురాలు ప్రశాంతి, సూపర్‌వైజర్ కమల్‌శేషు

రామచంద్రపురం రూరల్: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ప్రకటించిన ఉత్తమ సేవా పురస్కారాలను గురువారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో డీఎం హెచ్‌ఓ చేతుల మీదుగా అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎన్.ప్రశాంతి, డివిజినల్ సూపర్ వైజర్ జి.కమల్ శేషు, ద్రాక్షారామ ఏఎన్ఎం సుబ్బలక్ష్మి, ద్రాక్షారామ ఆశా సుజాత, పేకేరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మంగాదేవి, మాచవరం స్టాఫ్‌నర్సు కమలకుమారి, అంగర పీహెచ్‌సీ సీహెచ్‌ఓ దేవి, పామర్రు పీహెచ్‌సీ ఏఎస్ డబ్ల్యూఓ రేష్మ ఉన్నారు. వారికి డీఎంహెచ్‌ఓ దుర్గారావు దొర చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

13న జాబ్‌మేళా

రామచంద్రపురం: పట్టణంలోని వీఎస్ఎం కళాశాల ఆవరణలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13న మెగా సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం వెల్లడించారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, వీఎస్ఎం కళాశాల ప్రిన్సిపల్ కె.బాలాజీలు విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యం మాట్లాడుతూ స్థానిక వీఎస్ఎం కళాశాలలో ఈ నెల 13న ఉదయం 9 గంటల నుంచి ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. దేశంలోని ప్రముఖ ఐటీ సాఫ్ట్‌వేర్ కంపెనీల ద్వారా 300 మందికి పైగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించనున్నట్టు తెలిపారు. ఈ ఉద్యోగాల ద్వారా ఏడాదికి రూ.5 నుంచి రూ.12 లక్షల వరకు వార్షిక ప్యాకేజీ ఉంటుందని తెలిపారు. బీటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ కంప్యూటర్స్ తదితర గ్రూపుల్లో ఉత్తీర్ణులైన వారంతా ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు పింఛను సదుపాయం

సహాయ కార్మికశాఖాధికారి మల్లేశ్వరరావు

మండపేట: 60 ఏళ్లు నిండిన భవన నిర్మాణ కార్మికులకు రూ.3 వేలు పింఛను పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కార్మికశాఖ ద్వారా కల్పించిందని సహాయ కార్మిక శాఖ అధికారి కాశీ శివ నాగ మల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక టౌన్‌హాలు సమీపంలోని కామాక్షీ ఏకామ్రేశ్వర కల్యాణ మండపంలో గురువారం వడ్రంగి యువజన సంఘం ఆధ్వర్యంలో కార్మికులకు కార్మిక శాఖ అందించే పథకాలపై అవగాహన కల్పించారు. భవన నిర్మాణ రంగ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు అనేక పథకాలు ఉన్నాయన్నారు. వాటి ద్వారా లబ్ధి పొందాలంటే తొలుత ఈ–శ్రమ్ కార్డులు పొందాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా సభ్యత్వం పొందవచ్చన్నారు. సభ్యత్వం కలిగిన కార్మికుల్లో 60 ఏళ్లు నిండిన వారికి ప్రతి నెలా రూ.3 వేలు పింఛను అందించడం జరుగుతుందన్నారు. ప్రమాద బీమా కింద రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో వడ్రంగి నాయకులు గోడి సుబ్రహ్మణ్యం, కోటిపల్లి కృష్ణ, రామోజి కృష్ణ, కోటిపల్లి తిరుమలరావు, పొన్నాడ సత్తిబాబు, తామరపల్లి సూరిబాబు పాల్గొన్నారు.

ఎలుకల సామూహిక నివారణతో సత్ఫలితాలు

వ్యవసాయ శాఖ డీడీ వెంకటేశ్వరరావు



వెల్లలోని పంట పొలంలో ఎలుకల బొరియల్లో మందు పెట్టిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రామచంద్రపురం రూరల్: రైతులు ఎలుకల నిర్మూలన కార్యక్రమాలను సామూహికంగా చేపడితేనే అధిక ప్రయోజనం ఉంటుందని గుంటూరు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని వెల్ల గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరి పంటకు ఎలుకలు చేసే నష్టాన్ని నివారించుకోవడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం రైతులతో కలసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రైతులకు ఎర తయారు చేసుకునే విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా ఎలుకల మందు కలిపిన నూకల మిశ్రమం పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ వై. జ్యోతిర్మయి, డాట్ సైంటిస్ట్ నందకిషోర్, ఏడీఏ ఏవీఎస్ రంగారావు, డీఆర్‌సీ ఏఓ మనోహర్, వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

కాజులూరు: మండల గ్రామాలలో శుక్రవారం నుంచి జరగనున్న ఉచిత ఎలుకల మందు పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి అశోక్ కోరారు. గురువారం కాజులూరులో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాలలో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు బ్రొమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. కాజులూరు మండలానికి 81 కేజీల మందు విడుదలయ్యిందన్నారు. రైతులంతా ఒకే మారు సామూహిక ఎలుకల నివారణ చేపట్టి ఎలుకల నిర్మూలనను సాధించాలన్నారు.

రాయవరం: మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లూరు, వెంటూరు గ్రామాల్లో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి ప్రభాకర్ మాట్లాడుతూ రైతు వరి పంట వేసిన దగ్గర నుంచి పంట కోత కోసే వరకు ఎలుకల వలన అపారమైన నష్టం కలుగుతుందన్నారు. అందువలన రైతులంతా సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని కలిసి కట్టుగా చేయాలని సూచించారు. అనంతరం రైతులకు బ్రోమోడయలిన్ మందును సరఫరా చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

శ్రీరామకృష్ణను పరామర్శించిన ప్రజా ప్రతినిధులు



ఎంపీటీసీ సభ్యుడు శ్రీరామకృష్ణను పరామర్శిస్తున్న ప్రజా ప్రతినిధులు

రామచంద్రపురం రూరల్: పితృ వియోగంతో బాధపడుతున్న యనమదల ఎంపీటీసీ సభ్యుడు నురుకుర్తి శ్రీరామకృష్ణను ఎంపీపీ అంబటి భవాని ఆధ్వర్యంలో పలువురు ప్రజా ప్రతినిధులు గురువారం పరామర్శించారు. జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా(బాబ్జీ), వెలంపాలెం ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు, వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, యనమదల సర్పంచ్ పంపన వీర వెంకటరమణ, నాయకులు దడాల రవికుమార్, గుత్తుల శ్రీను తదితరులు పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

రామచంద్రపురం: రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఈ నెల 8 నుంచి 11 వరకు పిఠాపురంలో జరిగే రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, గన్నమని చక్రవర్తి, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జ మాణిక్యాలరావులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలియజేశారు.